క్లుప్తంగా

విద్యుత్ మీటర్ల మంజూరులో కొర్రీలు!



జగనన్న కాలనీలో నిర్మించిన ఇళ్లు

సారవకోట: మండల కేంద్రంలోని జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు పూర్తయినా.. విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేయడం లేదని పలువురు లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. సుమారు 27 ఇళ్లు మంజూరు కాగా.. 20 మంది వరకు నిర్మాణాలు ప్రారంభించారు. పలువురు ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి చేసుకున్నారు. సారవకోట విద్యుత్ శాఖ సిబ్బంది మీటర్లు ఏర్పాటు చేసేందుకు కొర్రీలు పెడుతున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంటి నిర్మాణ పనులు చేపడుతున్నప్పుడు విద్యుత్ అవసరం ఉంటుందని, మీటర్లు ఏర్పాటు చేసి కనెక్షన్ ఇచ్చేందుకు లేనిపోని కొర్రీలు పెడుతున్నారన్నారు. ఇప్పటికైనా వీలైనంత త్వరగా మీటర్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

రూ.51 వేల ఆర్థికసాయం



గౌరీకి ఆర్థికసహాయాన్ని అందజేస్తున్న సంఘం ప్రతినిధులు

నరసన్నపేట: స్థానిక శివనగర్ కాలనీకి చెందిన కానూరు పూర్ణారావు కుటుంబానికి స్వర్ణకార సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రూ.51 వేల ఆర్థిక సహాయాన్ని బుధవారం అందించారు. పూర్ణారావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. కుటుంబ పోషణకు వీలుగా పూర్ణారావు భార్య గౌరీకి సంఘం ప్రతినిధులు అద్దంకి మున్నా, తదితరులు ఆధ్వర్యంలో ఆర్థికసాయాన్ని అందించినట్లు సంఘం ప్రతినిధి సకలాభక్తుల గోవిందరావు తెలిపారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

నరసన్నపేట: మండలం కేంద్రం నరసన్నపేట తోపాటు పరిసర గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీ ఈపీడీసీఎల్ ఈఈ జి.శంకరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నరసన్నపేట, సత్యవరం, బొరిగివలస, జమ్ము, తామరాపల్లి, ఈదులవలస, కంబకాయ, టిక్కలిపాడు, దూకులపాడు, గొట్టిపల్లి, చల్లబంద, చీడీవలస, జడూరు. పిరివాడ, యాట్ల బసివలసలో ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

ఫిజియోథెరపీతో సత్ఫలితాలు



చిన్నారికి ఫిజియోథెరపీ చేస్తున్న ఈశ్వరరావు

మెళియాపుట్టి: ప్రత్యేక అవసరాల చిన్నారులకు క్రమం తప్పకుండా ఫిజియోథెరపీ చేసుకోవాలని పిజియోథెరపిస్టు ఎస్.ఈశ్వరరావు అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఉన్న భవిత కేంద్రంలో పలువురు చిన్నారులకు బుధవారం ఫిజియోథెరపీ చేశారు. అనంతరం సహిత ఉపాధ్యాయులు ఝాన్సీరాణి, శివప్రసాద్ మాట్లాడుతూ 0 నుంచి 18 ఏళ్ల వయసు గల పిల్లలను గుర్తించి ఫిజియోథెరపీ సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. దీనిపై ప్రత్యేక దృష్టి సారించి నమోదు చేయడం ద్వారా పిల్లల భవిష్యత్‌కు బాటలు వేసినట్ల అవుతుందన్నారు.

గ్రామాల అభివృద్ధిలో ప్రజాప్రతినిధులే కీలకం



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

ఎల్.ఎన్.పేట: గ్రామాల అభివృద్ధిలో ప్రజాప్రతినిధులే ఎంతో కీలకమని ఎంపీడీఓ పి.శ్రీనివాసరావు, ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లకు బుధవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. గ్రామాల అభివృద్ధి కోసం స్థానిక వనరులను ఉపయోగించుకుని ఆదాయ మార్గాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే నిధుల వినియోగంపై అవగాహన కలిగించారు. పంచాయతీరాజ్ చట్టాలు, గ్రామ పరిపాలన, గ్రామ సభలు, తీర్మానాల ఆవశ్యకతను తెలియజేశారు. శిక్షణ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కిలారి త్రినాథులు, ఎంపీపీ రెడ్డి జ్యోతిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అపార్ పూర్తి చేయాలి

నరసన్నపేట: మండలంలోని ప్రైవేట్ స్కూళ్లల్లో చదువుతున్న విద్యార్థులకు సంబంధించి అపార్ ఎన్‌రోల్‌మెంట్ తొందరగా పూర్తిచేయాలని ఎంఈఓ దాలినాయుడు సూచించారు. స్థానిక శర్వాణీ స్కూల్లో అపార్ ఎన్‌రోల్‌మెంట్‌పై సమీక్ష చేశారు. శతశాతం పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం పదో తరగతి విద్యార్థుల విద్యా ప్రమాణాలను పరిశీలించారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

యాంత్రీకరణతో.. సాగు సులభం

- పెరిగిన వరి కోత, నూర్పిడి యంత్రాల వినియోగం
- రైతులకు కాలం, ఖర్చులు ఆదా



వరికోత యంత్రంతో కోత కోస్తున్న రైతులు

ఆమదాలవలస:

వరి కోత, నూర్పిడి యంత్రాల వినియోగంపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. శ్రమ, కాలం, ఖర్చులు ఆదా అవుతుండడంతో వీటి వినియోగం రోజురోజుకూ పెరుగుతోంది. ప్రస్తుతం గ్రామాల్లో వరి కోత, నూర్పిడి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. గతంలో ఈ పనులను వ్యవసాయ కూలీలతో చేయించేవారు. అప్పట్లో రైతులు వ్యయప్రయాసలకు గురికావాల్సి వచ్చేది. యంత్రాలతో ఈ పనులు ప్రస్తుతం సులువుగా పూర్తవుతున్నాయి. నూర్పిడి యంత్రంతో ఎండుగట్టి రద్దుగా మారుతుండడంతో పశుగ్రాసానికి పనికిరావడం లేదు. దీనవల్ల కొందరు రైతులు వరికోత యంత్రాలను వినియోగిస్తున్నారు.

ఆమదాలవలస నియోజకవర్గంలోని ఖరీఫ్ వరిపంట (ఎకరాల్లో) వివరాలు

మండలం	వరి పంట
ఆమదాలవలస	11,138
బూర్జ	12,467
సరుబుజ్జిలి	11,156
పొందూరు	6,396

వరికోత యంత్రంతో..

సాధారణంగా ఎకరం విస్తీర్ణంలో వరి పంట కోయాలంటే 10 నుంచి 12 మంది కూలీలు అవసరం. ఒక్కొక్కరికి రూ.400 చొప్పున కూలీలు ఇస్తే రూ.4,000 నుంచి రూ.4,800 అవుతుంది. దీంతో పాటు వరి పనులు కుప్పలు చేయడానికి రూ.2వేలు, నూర్పిడి చేయడానికి రూ.3 వేల నుంచి రూ.4 వేలు అవుతుంది. ఇదే వరికోత, నూర్పిడి యంత్రాన్ని ఉపయోగిస్తే రూ.3 వేల నుంచి రూ.3,500 ఖర్చు అవుతుంది. ఎకరం పొలం గంటలో వరికోత, నూర్పిడి చేస్తుంది. రైతులకు ఎకరానికి రూ.5 వేల వరకు ఆదా అవుతుంది. కూలీలతో వరి పంట కోసేటప్పుడు ధాన్యం రాలిపోయే అవకాశం ఉంది. పనలు కూడా వత్తుగా పడతాయి, ఇవి ఆరడానికి పనలు తిరగేయాల్సి వస్తుంది. అదే యాంత్రీకరణతో కోత చేస్తే పనలు పలచగా పడడంతో తిరగేయాల్సిన పని లేదు. వరి నూర్పిడి యంత్రంతో పనిచేస్తే ఏకంగా ధాన్యమే చేతికి వస్తాయి.

ఆశల దిగుబడి..

ఈ ఏడాది ఖరీఫ్ సాగు చేసిన వరి పంట చేతికందడంతో రైతులు దిగుబడులపై ఆశలు పెట్టుకున్నారు. నూర్పిడి యంత్రంతో వరి కోతలు కోయడం వలన ధాన్యం కూడా దిగుబడి ఎంత వస్తుందో రైతులకు తెలుస్తుంది. ఎకరానికి 28 నుంచి 35 బస్తాలు (82 కిలోలు) దిగుబడి వస్తుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అధిక వర్షాలు, తెగుళ్లు వచ్చినా వరి పంటకు సకాలంలో నష్టనివారణ చర్యలు తీసుకోవడం వలన ధాన్యం దిగుబడులు వస్తున్నాయి.

వరికోత యంత్రంతో డబ్బు ఆదా..



ప్రస్తుతం కూలీల డిమాండ్ ఎక్కువగా ఉంది. వరికోత యంత్రంతో మా పొలం కోయించుకున్నాం. గతంలో ఎకరా వరిపంట కోతకు రూ.4,500 అయ్యేది. ప్రస్తుతం కోత, నూర్పుడి కలిసి రూ.3500 అవుతోంది.

– కొయ్యాన మల్లేష్, రైతు, చిట్టివలస, ఆమదాలవలస మండలం

యంత్రాలతో రైతులకు మేలు..



వరి పంటను కోత, నూర్పిడి యంత్రాలను రైతులు వినియోగించడం వల్ల ఖర్చులు ఆదా చేసుకోవచ్చును. సకాలంలో వరికోతలు పూర్తి కావడంతో పాటు ధాన్యం సులువుగా విక్రయించుకోచ్చు. ధాన్యం విక్రయాలు రైతులు నేరుగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తే పంటకు మంచి గిట్టుబాటు ధర కలుగుతుంది. రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుంది.

– మెట్ట మోహనరావు, మండల వ్యవసాయాధికారి, ఆమదాలవలస మండలం

బోరు బాగు చేసేదెప్పుడు?



సరుబుజ్జిలి మండలంలోని బప్పడాం ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉన్న తాగునీటి బోరు మూడు నెలల క్రితం మరమ్మతులు గురి కావడంతో హెడ్‌ను సంబంధిత అధికారులు తొలగించారు. నేటివరకు హెడ్ బిగించలేదు. ఎటువంటి రక్షణ చర్యలు చేపట్టలేదు. రక్షణలేని బోర్‌హెడ్ సమీపంలోనే ప్రతీరోజు విద్యార్థులు ఆటలు అడుతున్నారు. ఏదైనా ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించి బోరు వద్ద రక్షణ చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

– సరుబుజ్జిలి

తాగునీరు అందేది ఎప్పుడో..?



ఈ చిత్రం ఎల్.ఎన్.పేట మండలం తురకపేటలోనిది. మండలంలోని పలు గ్రామాలకు తాగునీరు అందించేందుకు నిర్మించిన మెగా రక్షిత తాగునీటి పథకం నుంచి సక్రమంగా తాగునీరు అందక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. పథకం నుంచి ఎప్పుడు తాగునీరు సరఫరా అవుతుందో? తెలియని దుస్థితి ఏర్పడిందని తురకపేట, దబ్బపాడు, శ్యామలాపురం, తురకపేట సెంటర్, కరకవలస, మల్లికార్జునపురం తదితర గ్రామాలకు చెందినవారు చెబుతున్నారు. ఒకరోజు తాగునీరు వస్తే నాలుగైదు రోజులు రావటం లేదని వాపోతున్నారు. అధికారులు స్పందించి సక్రమంగా తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

– ఎల్.ఎన్.పేట

పాముకాటు మృతిపై విచారణ



విచారణ చేస్తున్న నాగభూషణరావు

పొందూరు: స్థానిక సీహెచ్‌సీ సూపరింటెండెంట్, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా జి.సిగడాం మండలం చెట్టుపొదిలాం గ్రామానికి చెందిన కోళ్ల సూర్యనారాయణ మృతి చెందినట్లు మృతుని కుమారుడు కోళ్ల చక్రపాణి ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు డీసీహెచ్ఎస్ ఆదేశాలతో విచారణ అధికారి నాగభూషణరావు బుధవారం విచారణ జరిపారు. గతేడాది సెప్టెంబర్ 26న పొలంలో పాముకాటుకు గురైన కోళ్ల సూర్యనారాయణను అతని కుమారుడు కోళ్ల చక్రపాణి పొందూరు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అయితే ఆస్పత్రిలో ఉన్న స్టాఫ్‌నర్సు ఎఫ్ఎన్‌ఓతో చికిత్స చేయించి, కనీసం పాముకాటు ఇన్‌జంక్షన్ ఇవ్వకుండానే డ్యూటీ డాక్టర్‌కు తప్పుడు సమాచారం ఇచ్చి శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు. దీంతో మార్గమధ్యలోనే పరిస్థితి విషమించి సూర్యనారాయణ మృతి చెందాడు. దీనిపై మృతుడు కుమారుడు చక్రపాణి కలెక్టర్, డీసీహెచ్ఎస్‌కు ఫిర్యాదు చేయడంతో విచారణ జరిపించారు. అప్పటి సూపరింటెండెంట్ రామదాస్‌కు డ్యూటీ డాక్టర్ సుజాత వివరణ ఇచ్చారు. దీంతో మృతుని కుటుంబ సభ్యులు సంతృప్తి వ్యక్తం చేసినప్పటికీ, మిగిలిన ఇద్దరు స్పందించకపోవడంతో మరోసారి డీసీహెచ్ఎస్ కల్యాణ్‌బాబుకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఎటువంటి విచారణ జరపకుండా ఏకపక్షంగా డ్యూటీ డాక్టర్ సుజాతపై చర్యలు తీసుకున్నారు. మిగిలిన వారిపై చర్యలు తీసుకోకపోవడంతో చక్రపాణి విజయవాడలోని ఆరోగ్యశాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. గతంలో జరిగిన విచారణకు సంబంధించిన ఏటీఆర్ ఇవ్వలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. వివరణ ఇచ్చిన డ్యూటీ డాక్టర్‌పై చర్యలు తీసుకున్నా, మిగిలినవారిపై ఎందుకు చర్యలు తీసుకోలేదని విచారణ అధికారికి ప్రశ్నించారు. దీంతో విచారణ అధికారి నాగభూషణరావు మాట్లాడుతూ విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని తెలిపారు.

ఆయాపై కక్ష సాధింపు



పాఠశాల ఎదుట నిరసన తెలుపుతున్న ఆయా

సరుబుజ్జిలి: తనపై ఎటువంటి ఆరోపణలు లేకపోయినా కక్ష సాధింపుతో ఉద్యోగాన్ని తొలగించారని కొత్తకోట ప్రాథమిక పాఠశాల ఆయాగా పనిచేస్తున్న దళిత మహిళ తుంగాన మాధవి వాపోయారు. ఈ మేరకు ఆమె తన ఇద్దరి ఆడపిల్లలతో కలిసి పాఠశాల ఎదుట బుధవారం నిరసన తెలిపారు. ఎంఈవో, పాఠశాల హెచ్ఎం కలిసి తాను సరిగా పనిచేయలేదని ఆరోపణలు చేసి, ఏకపక్షంగా విధుల నుంచి తొలగించారని వాపోయారు. 2021 నుంచి ఆయాగా విధులు నిర్వహిస్తుండగా, 2024 నవంబర్ 9 నుంచి విధుల నుంచి తొలగించినట్లు హెచ్ఎం చెప్పారన్నారు. అలాగే 3 నెలల జీతాలు కూడా ఇవ్వలేదని వాపోయారు. చిరుద్యోగంతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్న తరుణంలో కక్షతో నాశనం చేయాలని చూస్తున్నారని విలపించారు. విధి నిర్వహణలో ఎటువంటి తప్పులేనప్పటికీ, ఒత్తిళ్లకు లొంగి తన ఉద్యోగాన్ని తొలగించారన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు పరిశీలించి న్యాయం చేయకపోతే తమ కుటుంబ సభ్యులంతా ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరించారు.

అవార్డు ప్రదానం



అవార్డు అందుకుంటున్న మురళీకృష్ణ

పొందూరు: మండలంలోని మలకాం గ్రామానికి చెందిన దున్న మురళీధర్ వాణిజ్య శాస్త్ర విభాగంలో రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపకుడిగా ఎంపికై సీఎం చంద్రబాబు, మానవ వనరుల శాఖ మంత్రి లోకేష్ చేతులమీదుగా అవార్డు అందుకున్నారు. మురళీకృష్ణ విశాఖలోని డాక్టర్ వీఎస్ కృష్ణ డిగ్రీ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్నాడు. బుధవారం విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయనను సన్మానించారు. దీంతో గ్రామస్తులు అభినందనలు తెలిపారు.


8 మద్యం బాటిళ్ల స్వాధీనం

ఆమదాలవలస: పట్టణంలోని వయోడెక్ట్ సమీపంలో బుధవారం 8 మద్యం బాటిళ్లు అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ సతీష్‌కుమార్ తెలిపారు. శ్రీకాకుళం రూరల్ మండలం భైరవానిపేటకు చెందిన ఊణ్న కేశవరావు వద్ద ఉన్న ఎనిమిది మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

బైండోవర్ నమోదు..

ఆమదాలవలస తహసీల్దార్ వద్ద బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న ఇద్దరు ముద్దాయిలను, సరుబుజ్జలి మండలంలో ఒకరిని, ఎల్ఎన్‌పేటలో నలుగురిని తహసీల్దార్‌ల ఎదుట హాజరుపర్చి బండోవర్ చేసినట్లు సీఐ తెలిపారు. బెల్టు షాప్‌లు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సైబర్ మోసాలపై అప్రమత్తం



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ వెంకటేష్

ఆమదాలవలస: యువత సైబర్ మోసాల బారిన పడుతున్నారని వాటిపై అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఎస్ఐ కె.వెంకటేష్ సూచించారు. బుధవారం సాయంత్రం మండలంలోని చిన్నజొన్నవలస రామాలయం వద్ద గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అత్యాశకు పోతే ఉన్న డబ్బులు కోల్పోతారన్నారు. కష్టపడి సంపాదించడం అలవర్చుకుంటే మంచి జీవితాన్ని కొనసాగించవచ్చునన్నారు. గంజాయిని విక్రయించినా, అక్రమ రవాణాకు పాల్పడినా అటువంటి వారిపై కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా సంక్షేమం గాలికి..

- పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



ఎల్.ఎన్.పేట: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత మహిళా సంక్షేమానికి ప్రాధాన్యత లేకుండా పోయిందని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి బుధవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ఎన్నికల ముందు అనేక సభల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్ సూపర్ సిక్స్ పథకాల కోసం ప్రచారం చేశారన్నారు. అదే సమయంలో కూటమి పార్టీల నాయకులు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలతో మేలు జరుగుతుందని ప్రజలకు, మహిళలకు నమ్మించారన్నారు. వారి పథకాలను నమ్మి ఓట్లు వేసిన మహిళలకు ఈ ఐదు నెలల పాలనలో అన్యాయం జరిగిందన్నారు. సూపర్ సిక్స్ పథకాల్లో ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు అని చెప్పి.. ఈ ఏడాదికి ఒక్కటే ఇస్తున్నారన్నారు. మిగిలిన రెండు గ్యాస్ సిలిండర్లకు ఎగనామం పెట్టారని ఆరోపించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఎందుకు అమలు చేయటం లేదని ప్రశ్నించారు. ఎంత మంది విద్యార్థులు చదువుకుంటే అంతమందికి ఏడాదికి రూ.20వేలు తల్లికి వందనం పేరుతో ఇస్తామని చెప్పారని, ఈ ఏడాది తల్లికి వందనం లేనట్టేనా? అని నిలదీశారు. 2014 ఎన్నికల ముందు చంద్రబాబు పసుపు-కుంకుమ, స్వయం శక్తి సంఘాల మహిళలకు రుణమాఫీ అని చెప్పి మోసం చేశారని గుర్తు చేశారు. సూపర్ సిక్స్ హామీలు అమలు చేసేందుకు వాయిదాల పద్ధతి ఏమిటన్నారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో ఇస్తామన్న పథకాలు సరైన సమయానికి అందజేశారన్నారు.

కర్రసాము పోటీల్లో ద్వితీయ స్థానం



ట్రోఫీ అందుకుంటున్న కోచ్ ఆవల కృష్ణ, విద్యార్థులు

నరసన్నపేట: ఆంధ్రప్రదేశ్ కర్రసాము అసోసియేషన్ ఆధ్వర్యంలో గుంటూరు టీజేపీఎస్ కళాశాల ఆవరణలో ఈ నెల 10 తేదీన సౌత్ జోన్ స్థాయి కర్రసాము–2024 చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. శ్రీకాకుళం జిల్లా తరపున నరసన్నపేటకు చెందిన కోచ్ ఆవల కృష్ణ ఆధ్వర్యంలో 25 మంది సభ్యులు పాల్గొన్నారు. వీరిలో 18 మంది మంచి ప్రతిభ చూపడంతో ద్వితీయ స్థానం వచ్చిందని కోచ్ బుధవారం తెలిపారు. అసోసియేషన్ ప్రతినిధులు తులసీ రామచంద్ర ప్రభు, ఉగ్గిరాల సీతారామయ్య చేతుల మీదుగా ట్రోఫీ అందుకున్నట్లు చెప్పారు. కర్రసాములో ప్రతిభ చూపిన విద్యార్థులందరూ నరసన్నపేట ప్రాంతానికి చెందిన వారేనని, వివిధ పాఠశాలల్లో చదువుకుంటూ కర్రసాములో శిక్షణ పొందుతున్నట్లు తెలిపారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

పాతపట్నం: నవంబర్ 14 నుంచి 20వ తేదీ వరకు పాతపట్నం శాఖా గ్రంథాలయంలో వారోత్సవాలు నిర్వహించనున్నట్లు శాఖాగ్రంథాలయాధికారి కాళ్ల రాజు బుధవారం తెలిపారు. 14న ప్రారంభ వేడుకలు, జాతీయ పతాకావిష్కరణ, 15న పుస్తక ప్రదర్శన, 16న గ్రంథాలయ ఉద్యమకారులను స్మరించుట, 17న వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్, వక్తృత్వ, పలు క్రీడా పోటీలు, తదితర కార్యక్రమాలు, 20న ముగింపు కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఆమదాలవలసలో..

ఆమదాలవలస: పట్టణంలోని 18వ వార్డు పరిధి బొడ్డేపల్లిపేటలో గల శాఖా గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు గ్రంథాలయాధికారి అన్నెపు కోటేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 10 గంటలకు మున్సిపల్ కమిషనర్ పూజారి బాలాజీ ప్రసాద్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారన్నారు. వారం రోజుల పాటు నిర్వహించే పోటీల్లో గెలిపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తామన్నారు.

చెడు వ్యసనాలతో జీవితాలు నాశనం



మాట్లాడుతున్న ఎస్ఐ లావణ్య

పాతపట్నం: విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని పాతపట్నం ఎస్ఐ బి.లావణ్య అన్నారు. బుధవారం స్థానిక కిరణ్మయి జూనియర్ కళాశాలలో సైబర్ మోసాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రిన్సిపాల్ మానస, అధ్యాపకులు పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు

బూర్జ: మైనర్లకు వాహనాలు ఇవ్వడం వల్ల, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే వచ్చే ఇబ్బందులను స్థానిక ఎస్ఐ ఎం.ప్రవల్లిక వివరించారు. బుధవారం మండలంలోని తోటవాడ గ్రామంలో విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఫోన్ అతిగా వినియోగిస్తే తీవ్రమైన నష్టం కలుగుతుందన్నారు. సైబర్ క్రైమ్, మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు.

బెల్ట్ షాపులు నిర్వహిస్తే కేసులు

ఎల్.ఎన్.పేట: గ్రామాల్లో మద్యం బెల్ట్‌షాపులు నిర్వహిస్తే అలాంటి వారిపై కేసులు నమోదు చేయటం జరుగుతుందని అమదాలవలస ఎక్సైజ్ ఎస్ఐ జానకి కావ్య అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బైండోవర్ నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన ఐదుగురు వ్యక్తులు మద్యం విక్రయిస్తున్నట్లు పట్టుకుని వారిపై బైండోవర్ నమోదు చేయించామన్నారు. వీరు మద్యం విక్రయిస్తూ మరోసారి పట్టుబడితే రూ.లక్ష అపరాధ రుసుంతోపాటు ఏడాది జైలు శిక్ష విధించటం జరుగుతుందన్నారు. సిబ్బంది ఎస్.ధర్మారావు పాల్గొన్నారు.

ముమ్మరంగా పంటకోత ప్రయోగాలు



ఇల్లయ్యగారిపేటలో నిర్వహిస్తున్న పంటకోత ప్రయోగం

పొందూరు: ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకంలో భాగంగా మండలంలో వ్యవసాయ, గణాంకశాఖ అధికారులు పంట కోత ప్రయోగాలను ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. బుధవారం రాపాక, ఇల్లయ్యగారిపేట గ్రామాల్లో నిర్వహిస్తున్న పంట కోత ప్రయోగాలను గణాంకశాఖ ముఖ్య ప్రణాళిక అధికారి ప్రసన్న, ఉపగణాంకాధికారి శ్రీదేవి పర్యవేక్షించారు. మండల వ్యవసాయశాఖ అధికారి బెండి బాబ్జి, ఏఎస్ఓ శేఖర్, రైతులు పాల్గొన్నారు.

ప్రణాళికలు సిద్ధం చేయాలి

బూర్జ: ఉపాధి హామీ పథకం ద్వారా మండలంలోని అన్ని గ్రామాల్లో 2024–25లో చేపట్టనున్న పనులకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంపీడీఓ ఆర్.తిరుపతిరావు అన్నారు. ఉపాధి హామీ ఏపీఓ వి.రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బందితో బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. అన్ని గ్రామాల్లో సీసీ రోడ్లు, తాగునీటి సదుపాయం త్వరగా కల్పించాలన్నారు. రానున్న సంవత్సరానికి పనులు అంచనాలు త్వరగా తయారుచేయాలన్నారు. గ్రామాల్లో జాబ్ కార్డుల తనిఖీలు నిర్వహించాలన్నారు. మృతి చెందిన, వలస వెళ్లిన వారి వివరాలు గుర్తించి తక్షణమే పేర్లు తొలగించాలన్నారు. ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

కాగువాడలో ఆధ్యాత్మిక శోభ



శ్రీకృష్ణుడు, రాధ ప్రతిమలను ఊరేగిస్తున్న భక్తులు

పాతపట్నం: మండలంలోని కాగువాడ గ్రామంలో హరే రామ, హరే కృష్ణ నామ సంకీర్తనలు ఘనంగా నిర్వహించారు. బుధవారం ద్వాదశి సందర్భంగా గ్రామంలో శ్రీకృష్ణుడు, రాధ ప్రతిమలను ఊరేగించారు. కాగువాడ, బూరగాం, కొరసవాడ గ్రామస్తులు పాల్గొన్నారు.

అన్నసమారాధన



అన్నప్రసాదం కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

పాతపట్నం: కార్తీక మాసం ద్వాదశి సందర్భంగా శివాలయాలన్నీ బుధవారం భక్తులతో కిటాకిటాలాడాయి. మండల కేంద్రంలోని కేథారేశ్వర ఆలయం వద్ద భారీ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పాతపట్నంతోపాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించారు.